క్లుప్తంగా

విద్యార్థికి సన్మానం

వనపర్తి టౌన్: నీట్–2023 ఫలితాల్లో 523 మార్కులు సాధించిన శ్రేషితను సోమవారం స్కాలర్స్ కళాశాల యాజమాన్య సభ్యులు కళాశాలలో శాలువా, బొకే సన్మానించారు. ఈ సందర్భంగా యాజమాన్య సభ్యులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ వరప్రసాద్, నాగేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడం 60శాతం అధ్యాపకుల బాధ్యత అని, మిగతా 40శాతాన్ని తల్లిదండ్రులు వారి కృషికి అనుగుణంగా ప్రోత్సహిస్తే విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. అదేవిధంగా 468 మార్కులు సాధించిన రమ్య, శశాంక్ 408, వంశీ 384, ఆర్. పల్లవి 362 మార్కులు సాధించడంతో వారి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్, లెక్చరర్లు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు



ఆత్మకూర్: కంచెలేని ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదాలకు నిలయంగా మారుతుండడంతో సర్పంచ్ విజయలక్ష్మి స్పందించారు. మండలంలోని పిన్నంచర్ల ఆంజనేయస్వామి ఆలయం ఎదుట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఇటీవల మేకల మంద విద్యుదాఘాతానికి గురయ్యాయి. దీంతో స్పందించిన గ్రామ పాలకమండలి ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు హర్షం ప్రకటించారు.

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



పాన్‌గల్: మత్స్యకారులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి దిష్టిబొమ్మను సోమవారం మండలంలోని రేమద్దులలో మత్స్యకారుల సంఘం ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ.. కౌశిక్‌రెడ్డి చేస్తున్న కార్యక్రమాలను చిత్రీకరించిన యూట్యూబ్ జర్నలిస్టును కిడ్నాప్ చేసి దాడి చేయడంతో పాటు కులం పేరుతో దూషించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎమ్మెల్సీ ఎక్కడ తిరిగినా అడ్డుకొని తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ స్పందించి కౌశిక్‌రెడ్డిపై తగు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిరంజన్, కుర్మయ్య, భాస్కర్, లోకేష్, నాగయ్య, బుచ్చయ్య, రాములు, బాలకృష్ణ, రాజేష్, బక్కన్న, లక్ష్మయ్య చంద్రయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి

వీపనగండ్ల: పఠనోత్సవ ఉద్దేశాన్ని విద్యార్థులకు తెలియజేసి ధారాళంగా చదవడం, రాయడం అలవాటు చేసుకునే విధంగా వారిని తీర్చిదిద్దాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏసీఈఆర్‌టీ ఆదేశాల మేరకు వచ్చే నెల 31వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు పఠనోత్సవాలను నిర్వహించాలని ఆయన అన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న వంగూరు గంగిరెడ్డి స్వయానా రచించిన వంగూరి వారి వాచకం మినీ కవితా సంపుటిని పాఠశాల గ్రంథాలయానికి వితరణగా అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింహారెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణ, మహేష్, బాలు, మౌలానా, సీఆర్‌పీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో పఠనోత్సవం కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, మండల విద్యాధికారి జయరాములు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులను చదివేందుకు అందరూ కృషి చేద్దాయాలని పిలుపునిచ్చారు. అలాగే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, రెండు జతల యూనిఫాంను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్ గోపిబాబు, పాఠశాల ప్రత్యేకాధికారి పద్మారెడ్డి, ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

పోచ రవీందర్‌రెడ్డికి సన్మానం



వనపర్తి: ఇప్పటికి 82 సార్లు రక్తదానం చేసి, ఇటీవల గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ చేతుల మీదుగా అవార్డు పొందిన సామాజిక కార్యకర్త పోచ రవీవదర్‌రెడ్డిని సోమవారం ఏఎస్పీ షాకీర్ హుస్సేన్ తన చాంబర్‌లో శాలువాతో సత్కరించారు. ఒకరి రక్తదానం మరొకరికి ప్రాణదానంగా భావించి రికార్డుస్థాయిలో రక్తదానం చేసి సామాజిక బాధ్యతను చాటుకోవటం అభినందనీయమన్నారు.

అటకెక్కిన పర్యాటకం

- రంగసముద్రం రిజర్వాయర్‌లో నిరుపయోగంగా పడవలు
- ఆలయ పరిసరాల్లో వసతులు కరువు
- నిరాశలో పర్యాటకులు



నిరుపయోగంగా బోటింగ్ పడవలు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని రంగనాయక స్వామి ఆలయాన్ని, పక్కనే రంగసముద్రం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను కలిపి పర్యాటక కేంద్రంగా మార్చాలని ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం ప్రభుత్వం టూరిజం శాఖ ఆధ్వర్యంలో రూ.కోట్లు వెచ్చించి జలాశయంలో భక్తులు, పర్యాటకులు విహరించేందుకు రెండు పడవలు కొనుగోలు చేసింది. ఈ ప్రాంతానికి వచ్చిన వారు ఆలయంలో స్వామిని దర్శించుకోవడంతో పాటు రంగసముద్రం రిజర్వాయర్‌లో బోటు షికారు చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది జనవరిలో ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసి బోట్లను ప్రారంభించారు. కొన్నాళ్లు సాఫీగానే సాగిన బోటు షికారు అనంతరం అటకెక్కింది. 3 నెలలుగా టూరిజం శాఖ పట్టించుకోక పోవడంతో వాటిని ఉపయోగించిన దాఖలాలు లేవు. సెలవు దినాలను ఆలయ, రిజర్వాయర్ పరిసరాల్లో ఆనందంగా గడపడానికి కుటుంబాలతో వచ్చే వారికి నిరాశే మిగలడంతో వారు అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు రంగనాథ స్వామిని దర్శించుకోవడానికి వస్తుంటారు. రంగసముద్రంలో బోటింగ్ సౌకర్యం లేకపోవడంతో వారు నిరాశ చెందుతున్నారు. నిర్వహణ లేకపోవడంతో మర బోట్లు జలాశయం ఒడ్డుకు చేరాయి. అధికారులు స్పందించి పడవలను పునఃప్రారంభించేందు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



రిజర్వాయర్‌లో విహరిస్తున్న పర్యాటకులు (ఫైల్)

మూన్నాళ్ల ముచ్చటే..



రంగసముద్రం రిజర్వాయర్‌లో బోటింగ్ ప్రారంభించడంతో చాలా సంతోషించాం. దీనివల్ల స్థానికులకు కూడా ఉపాధి పెరుగుతుందని ఆశపడ్డాం. కానీ అది మూణ్ణాళ్ల ముచ్చటగా మారింది. ఇక్కడికి పర్యాటకులు, భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. మంత్రి నిరంజన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలన్నారు.

– రాఘవాచారి, రిటైర్డ్ ఉద్యోగి, శ్రీరంగాపురం

అధికారులు స్పందించాలి



రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో ఒకటిగా పేరున్న రంగనాథ ఆలయానికి పర్యాటక కేంద్రంగా గుర్తింపు ఉండడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన పర్యాటకులు నిత్యం వస్తుంటారు. టూరిజం అధికారులు తక్షణమే స్పందించి మౌలిక వసతులు కల్పించాలి. రిజర్వాయర్‌లో బోటింగ్ ప్రారంభించాలి.

– సితార వెంకటేశ్వర్లు, నూగూరు, పెబ్బేరు మండలం

ఇంకుడుగుంతలతో భూగర్భ జలాల పెరుగుదల



సామూహిక ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న ఏపీడీ సుల్తాన్

వీపనగండ్ల: సామూహిక ఇంకుడు గుంతలతో అధిక ప్రయోజనం ఉంటుందని ఏపీడీ సుల్తాన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో కమ్యూనిటీ ఇంకుడు గుంతల నిర్మాణాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రులు, అధిక జనాభా ఉండే ప్రాంతాలల్లో వీటిని నిర్మించడం వల్ల నీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. గ్రామాల్లో ప్రజలు తమ ఇళ్ల వద్ద ఇంకుడు గుంతలను నిర్మించుకోవడం వల్ల పరిసరాల పరిశుభ్రత ఏర్పడుతుందన్నారు. దీంతో అంటువ్యాధుల బారిన పడకుండా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కతలప్ప, సర్పంచ్ నర్సింహారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి నరేష్, ఫీల్డ్ అసిస్టెంట్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లి శివారులో సోమవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కంచిరావుపల్లి శివారులో ఓ రైతు పొలంలో షెడ్డు పక్కన 8 మంది పేకాట ఆడుతున్నట్లు పక్క సమాచారంతో దాడి చేశామన్నారు. వారిలో ఏడుగురు దొరకగా.. ఒకరు పారిపోయారు. రూ. 8,900, పేక ముక్కలు స్వాధీనం చేసుకోవడంతో పాటు జైపాల్‌రెడ్డి, రాఘవేందర్‌గౌడ్, లక్ష్మయ్య, రవీందర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, బుచ్చారెడ్డి, రామచంద్రయ్య, రాములుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

గ్రామకంఠం భూములను కాపాడండి

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ భూములతో పాటు గ్రామ కంఠం భూములను కాపాడాలని కోరుతూ బీజేపీ నాయకులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో సర్వే నంబర్ 506, 147, 149లో దాదాపు పది ఎకరాల స్థలం ప్రభుత్వ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్నా సంబంధిత అధికారులు వాటిని స్వాధీన పర్చుకోలేక పోతున్నారని ఆరోపించారు. అదే విధంగా సర్వే నంబర్ 505లో ఉన్న ఎకరం స్థలం అన్యాక్రాంతం అవుతుందని, వీటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోని సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో క్యామ భాస్కర్, అశోక్, నరాల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల్లో అన్యాయం..

మున్సిపాలిటీలో విధులు నిర్వహించి వయోభారంతో తమ పిల్లలకు ఉద్యోగ అవకాశం ఇవ్వాలని కోరుతున్నా మున్సిపల్ పాలక మండలి తనకు అన్యాయం చేసిందని కొంగరి కృష్ణమూర్తి కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. తన తండ్రి అంబదాస్‌ను తొలగించారని అతనితో పాటు తొలగించిన వారి పిల్లలకు ఉద్యోగ అవకాశం కల్పించినా.. తనకు మాత్రం ఉద్యోగం ఇవ్వక పోవడం ఏమిటన్నారు.

సాహు మహారాజ్‌కు ఘన నివాళి



వనపర్తి టౌన్: నిమ్నకులాల హక్కుల సాధన కోసం పోరాడిన మహనీయుడు సాహు మహారాజ్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందారని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాశ్ పేర్కొన్నారు. సోమవారం ఛత్రపతి సాహు మహారాజ్ జయంతిని పురస్కరించుకొని టీజేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కవి గిరిరాజాచారి, డాక్టర్ నాయకంటి నరసింహశర్మ, మంద్ల దేవన్న నాయుడు, కావలి బాలస్వామి, కవి ఈశ్వర్, పరమేశ్వరచారి, గంగాధర్ చారి, మురళీధర్‌చారి, సత్యం చారి, గుణగంటి వెంకటయ్య, మద్దిలేటి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టికెట్ ఇవ్వకుంటే రాజీనామా చేస్తాం

పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ టికెట్ జగదీశ్వర్‌రావుకు కేటాయించకుంటే మూకుమ్మడిగా రాజీనామా చేస్తామని మండల నాయకులు హెచ్చరించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నాయకులు బాలపీరు, విష్ణువర్ధన్‌రెడ్డి, రామస్వామి, కొండల్‌రావు, రాజేందర్‌రెడ్డి, బక్కలయ్య సమావేశమై మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ చావుబ్రతుకులో ఉన్న సమయంలో ఊరూరా తిరుగుతూ జగదీశ్వర్ రావు పార్టీకి జీవం పోశారని తెలిపారు. మధ్యలో పార్టీలో చేరుతున్న జూపల్లి కృష్ణారావుకు టికెట్ ఇస్తే తామంతా రాజీనామ చేసి వెళ్లిపోతామన్నారు. పార్టీ గెలిచి కృష్ణారావు మంత్రి పదవులు అనుభవించి, పార్టీని సర్వనాశనం చేసిన వ్యక్తిని మళ్లీ ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. కార్యక్రమంలో గులాంరసూల్, ఎంపీటీసీ దళారి ఖాజా, ఎల్లయ్య, నరేష్, మాణిక్యం, కురుమయ్య, అశోక్, సాయి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



పాన్‌గల్: వ్యక్తి అదృశ్యమైన ఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవిప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కేతేపల్లికి చెందిన అన్మగాళ్ల బొజ్జన్న(64) ఈనెల 23వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఎక్కడ ఆచూకీ లభించలేదు. దీంతో కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. అతడి ఆచూకీ లభిస్తే సెల్ నంబర్ 87126 70616 సమాచారం ఇవ్వాలన్నారు.

సీఎం కేసీఆర్ అవినీతిని ఎండగడతాం



ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఆత్మకూర్: పట్టణంలో ఈ నెల 29న నిర్వహించే బహిరంగ సభకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ హాజరవుతున్నారని బీజేపీ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అశ్విన్‌కుమార్, నియోజకవర్గ కో కన్వీనర్ రేచింతల శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలోని వార్డుల్లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెల 29న పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 4 గంటలకు బీజేపీ సభకు జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నందున కార్యకర్తలు, నాయకులు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అవినీతిని ఎండగడతామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు తమ్మలివిజయ్, జిల్లాఉపాధ్యక్షుడు నాగేందర్‌రెడ్డి, నాయకులు ఆనంద్, కొండాపురం రాము, తమ్మలి వెంకటేష్, రఘు, శేషు, భీంరెడ్డి, బాలకృష్ణ, సమద్, లక్ష్మీనారాయణ, సూరి, చందు, బాలరాజు, వెంకట్రాములు, శ్యామ్ తదితరులు ఉన్నారు.

పెన్షనర్లను ప్రభుత్వమే ఆదుకోవాలి



అమరచింతలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న పెన్షనర్లు

వనపర్తి టౌన్: పెన్షనర్లు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని టీజీపీజేఏసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో పెన్షనర్లకు నగదు రహిత వైద్యం అమలు చేయాలని, ఈ స్కీంను యూనివర్సిటీ, రిటైర్డ్ లెక్చరర్లు, జీహెచ్ఎంసీ, ఏయిడెడ్, మార్కెటింగ్ శాఖ పెన్షనర్లకు సైతం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 28న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేసి వినతి పత్రం అందజేస్తామని, అప్పటికీ పెన్షనర్ల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించకపోతే జూలై 12వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీజీపీజేఏసీ రాష్ట్ర కౌన్సిలర్ అగ్గి రాముడు, టీజీపీజేఏసీ జనరల్ సెక్రటరీ యోసేపు, టీజీపీజేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు చిన్నరాములు ఉన్నారు.

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు తహసీల్దార్ చాంద్‌పాషాకు సోమవారం వినతిపత్రం అందించామని విశ్రాంత ఉపాధ్యాయులు సంఘం అధ్యక్షుడు రత్నం తెలిపారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో చికిత్స పొందుతున్న పెన్షనర్లకు ఒకటో పీఆర్సీలకు అనుకూలంగా పూర్తి స్థాయిలో ఈహెచ్ఎస్ అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కురుపమ్మ, షేక్‌అహ్మద్, క్యామరాములు, పద్మ, సురేందర్‌లు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పించాలి



ఆత్మకూర్‌లో నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు బంద్ నిర్వహించారు. ఈసందర్భంగా ఏబీవీపీ మండల కన్వీనర్ అఖిల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో 15వేల ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పాఠశాలల్లో తాగునీటి సదుపాయం కూడా కల్పించట్లేదన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజుల దోపిడిని అరికట్టాలని, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రవివర్మ, రాజేష్, సందీప్, వంశీ, రాజేష్, మహేష్, ప్రవీణ్, రవి, విద్యార్థులు ఉన్నారు.

పరిహారం చెల్లించాలి

కొల్లాపూర్: నేషనల్ హైవే 167కేలో భాగంగా కొల్లాపూర్ సమీపంలో నిర్మించనున్న బైపాస్ రహదారిలో ప్లాట్లు కోల్పోతున్న వారికి నష్టపరిహారం చెల్లించాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. సోమవారం ఆర్డీఓ హనుమనాయక్‌కు వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులతో పాఠశాల పారిశుద్ధ్య పనులు



పాఠశాలను శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని కంభాళాపురం ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్వీపర్ లేక, పారిశుద్ధ్య కార్మికులు రాకపోవడంతో పాఠశాల ఆవరణం చెత్తాచెదారంతో నిండింది. సోమవారం ఉదయం పాఠశాలకు వచ్చిన విద్యార్థులే ఆవరణను శుభ్రం చేసే పనిలో పడ్డారు. అక్కడే ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు దీన్ని చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో పాఠశాలను శుభ్రం చేయడానికి స్వీపర్, స్కావెంజర్లలో ఎవరో ఒకరు ఉండేవారు. ప్రభుత్వం వారిని తొలగిస్తూ పాఠశాలను శుభ్రం చేసే బాధ్యతలను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. గ్రామ పంచాయతీ వారు పారిశుద్ధ్య కార్మికులచే నిత్యం పాఠశాలను శుభ్రం చేయించాలి. ఇక్కడేమో పారిశుద్ధ్య కార్మికులు నిత్యం పాఠశాలకు వెళ్లే పరిస్థితి లేదు. వారానికి ఒకసారి పాఠశాలకు వెళ్లి శుభ్రం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి పాఠశాలకు స్వీపర్‌ను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి స్థల పరిశీలన



మస్తీపురంలో స్థల పరిశీలన చేస్తున్న తహసీల్దార్ చాంద్‌పాషా

అమరచింత: మండలంలోని మస్తీపురంలో నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణం కోసం సర్వే నంబర్ 278లో గల ఎకరం ప్రభుత్వ స్థలాన్ని సోమవారం పరిశీలించినట్లు తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా తెలిపారు. గ్రామంలో పంచాయతీ భవన నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజూరు కావడంతో కొత్త భవనం కోసం అనువైన ప్రభుత్వ స్థలాలను ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశాల మేరకు స్థల పరిశీలన చేశామన్నారు. ప్రభుత్వ స్థలానికి సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు నివేదిస్తామని తెలిపారు. మండలంలోని నాగల్‌కడ్మూర్, చింతరెడ్డిపల్లి, మస్తీపురం, చంద్రనాయక్‌తండా పంచాయతీలకు నూతన భవన నిర్మాణాల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వీటిలో ఇప్పటి వరకు నాగల్‌కడ్మూర్, చింత రెడ్డిపల్లి గ్రామాల్లో స్థల ఎంపికతో పాటు నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసినట్లు వెల్లడించారు. మస్తీపురం, చంద్రనాయక్ తండాలో పూర్తి కావాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గోపాల్, సర్పంచ్ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: మండలంలోని కిష్టాపూర్‌తండా ప్రాథమిక పాఠశాలను సోమవారం ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచేలా బోధన సాగించాలని, విద్యలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవీసింగ్, మాజీ సర్పంచ్ చంద్రూనాయక్, పాఠశాల హెచ్ఎం మురళి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

స్వతంత్ర జర్నలిస్టులకు రక్షణ కల్పించాలి



ఏఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

వీపనగండ్ల: స్వతంత్ర మహిళా జర్నలిస్ట్ తులసి చందుకు వెంటనే రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివిధ ప్రజా సంఘాల పోరాట ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఏఎస్ఐ చంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టు హక్కుల కోసం అహర్నిశలు పనిచేస్తూ పేద, బడుగు బలహీన వర్గాల పక్షాన నిలుస్తున్న మహిళా జర్నలిస్టు తులిసి చందుకు మతోన్మాద శక్తుల నుంచి బెదిరింపులు రావడం తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టు హక్కులను కాపాడుతామని చెప్పడమే తప్పా నిజమైన జర్నలిస్టులకు రక్షణ లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు మురళి, సీఐటీయూ నాయకులు ఆశన్న, రాముడు, రైతు సంఘం నాయకులు ఈశ్వర్, ఎస్ఎఫ్ఐ నాయకులు రామకృష్ణ, నవీన్ అన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న గిరిజనులు

పాన్‌గల్: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదని గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాల్యానాయక్ హెచ్చరించారు. గిరిజనులకు గిరిజన బంధు అమలు చేయాలని, ఎస్టీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలను మంజూరు చేయాలని కోరుతూ గిరిజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే రుణాలకు ఎంపికైన లబ్ధిదారులకు రుణాలు అందించడంలో తీవ్ర జాప్యం జరుగుతుందన్నారు. పోడు భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పోడు పట్టాలు, అర్హులైన గిరిజనులకు పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే గిరిజనులను సమీకరించి కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తండా సర్పంచ్ శాంతమ్మ, గిరిజన సంఘం నాయకులు సోమ్లనాయక్, బాబునాయక్, చిట్టెమ్మ, కిషన్‌నాయక్, శంకర్‌నాయక్, బాలునాయక్, మహిళలు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిని తొలగించాలని ఎంపీడీఓకు వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, గ్రామస్తులు

పాన్‌గల్: మండలంలోని చిక్కేపల్లి పంచాయతీ కార్యదర్శిని మార్చాలని కోరుతూ సర్పంచ్ బాలస్వామియాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి పనుల విషయంలో పంచాయతీ కార్యదర్శి ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని, దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని పంచాయతీ కార్యదర్శిని మార్చాలని వినతిపత్రంలో కోరినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ధర్మారెడ్డి, వెంకట్‌రాములుయాదవ్, ఖాదర్, బిచ్చాలు, కురుమూర్తి పాల్గొన్నారు.

విద్యుత్ వైర్ల కిందనున్న వృక్షాల తొలగింపు

ఆత్మకూర్: పట్టణంలో ప్రతినిత్యం విద్యుత్ సమస్యలు తలెత్తుతుండడంతో సోమవారం చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవియాదవ్ ఆధ్వర్యంలో కేశవస్వామి గుడి నుంచి అమరచింత వైపు రోడ్డులో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్లను, కొమ్మలను తొలగించారు.